క్లుప్తంగా

అకాల వర్షం.. పంటలకు నష్టం

లింగాపూర్: పంటల దిగుబడులు చేతికందే సమయంలో కురిసిన అకాల వర్షాలకు రైతన్నలు తీవ్రంగా నష్టపోయారు. మండలంలో సోమవారం తెల్లవారుజామున కురిసిన వర్షంతో వేలాది ఎకరాల్లో పత్తి, కంది పంటలు దెబ్బతిన్నాయి. ప్రస్తుతం కంది పంటలు పూత, పిందె దశలో ఉన్నాయి. అకాల వర్షాలకు పూత రాలిపోవడంతో పాటు పిందెకు కాయతొలిచే పురుగు ఆశించే ప్రమాదం ఉంది. మండలంలో లింగాపూర్, పిక్లాతండా, రాము నాయక్ తండా, కొత్తపల్లి, వంకామద్ది, దంపూర్, చోర్‌పల్లి ప్రాంతాలలో అకాల వర్షంతో దెబ్బతిన్న పంటపై సర్వే చేపట్టి ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

గురునానక్ జయంతి వేడుకల్లో ఎమ్మెల్యే


ప్రార్థనలు చేస్తున్న ఎమ్మెల్యే కోనప్ప

కాగజ్‌నగర్‌టౌన్: సిక్కుల మత గురువు గురునానక్ జయంతి సందర్భంగా కాగజ్‌నగర్ పట్టణంలో నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనల్లో సిక్కు మతస్తులతో కలిసి ఎమ్మెల్యే కోనేరు కోనప్ప ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వేడుకల్లో పాల్వాయి..

పట్టణంలోని గురుద్వారాలో గురునానక్ 554వ జయంతి సందర్భంగా నిర్వహించిన ప్రార్థనలో బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ పాల్వాయి హరీశ్‌బాబు పాల్గొన్నారు.

పండ్లు పంపిణీ


పండ్లు పంపిణీ చేస్తున్న ప్రతినిధులు

ఆసిఫాబాద్‌అర్బన్: ఎం.ఎం. హెల్ప్‌లైన్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు మహమూద్ 3వ వర్ధంతి సందర్భంగా హెల్ప్‌లైన్ ఫౌండేషన్ ప్రతినిధులు సోమవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు. మదర్స అరేబియా మదీన తుల్‌లుమ్‌లో పిల్లలకు పండ్లు పంపిణీ చేశారు. ఎంఎం హెల్ప్‌లైన్ ఫౌండేషన్ చైర్మన్ అహ్మద్, సభ్యులు అన్సార్, సాజిద్, నిసార్, సులేమాన్, జమీల్, ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రచారానికి వచ్చిన స్థానికేతరులు వెళ్లిపోవాలి

కాగజ్‌నగర్‌టౌన్: ఎన్నికల ప్రచార నిమిత్తం ఆయా పార్టీల తరఫున ఇతర ప్రాంతాల నుంచి సిర్పూర్ నియోజకవర్గానికి వచ్చిన స్థానికేతరులు మంగళవారం సాయంత్రం 4 గంటల్లోగా తిరిగి వారి ప్రాంతాలకు వెళ్లిపోవాలని కాగజ్‌నగర్ సబ్ డివిజనల్ పోలీసు అధికారి కరుణాకర్ తెలిపారు. ఈనెల 30న పోలింగ్ జరగనున్న దృష్ట్యా విషయాన్ని గమనించాలన్నారు. ఈ నిబంధనలు రాజకీయ పార్టీలు, బరిలో ఉన్న అభ్యర్థులు, వారి ఏజెంట్లు తూ.చ. తప్పకుండా పాటించాలని తెలిపారు.

ఘనంగా ఎన్‌సీసీ అవతరణ దినోత్సవం

ఆదిలాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల బాలుర డిగ్రీ కళాశాలలో సోమవారం ఎన్‌సీసీ అవతరణ దినోత్సవ వేడుకలను కళాశాల ఎన్‌సీసీ అధికారి పుట్ట లక్ష్మణ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ఎన్‌సీసీ ద్వారా మంచి పౌరుడిగా లక్షణాలు, క్రమశిక్షణ, ఐక్యత నాయకత్వ లక్షణాలు, మంచి విలువలతో జీవించే జీవన విధానం, దేశానికి జాతికి సేవ చేసే అవకాశం ఎన్‌సీసీ ద్వారానే సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస స్వామి, అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

ఉట్నూర్‌రూరల్: ఈనెల 29న మడావి తుకారం ఐఏఎస్ 25వ వర్ధంతి సభ నిర్వహించడం జరుగుతుందని మడావి తుకారం యూత్ అధ్యక్షుడు ఆత్రం మారుతి తెలిపారు. సోమవారం ప్రెస్‌భవన్‌లో సభ పోస్టర్ ఆవిష్కరించారు. ఉదయం 10గంటలకు ఉట్నూర్ ఎక్స్‌రోడ్డులోని తుకారం విగ్రహం వద్ద నివాళులర్పించడం జరుగుతుందన్నారు. ఉమ్మడి జిల్లాలోని ఆదివాసీ సంఘాలు, రాయిసెంటర్ సార్‌మేడిలు హాజరు కావాలని కోరారు.

ఉచిత టీబీ నిర్ధారణ పరీక్షలు

మందమర్రిరూరల్: పట్టణంలోని పాత బస్టాండ్ సమీపంలోని పీహెచ్‌సీలో సోమవారం మొబైల్ వ్యాన్ ద్వారా ఉచిత టీబీ నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. పలు ఏరియాలతోపాటు, గ్రామాల నుంచి టీబీ అనుమానితులు 102 మందికి వైద్యపరీక్షలు చేసినట్లు డాక్టర్ రమేశ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీబీ వ్యాధిగ్రస్తులకు ఉచిత మందులతోపాటు చికిత్స పూర్తయ్యేవరకు వారికి ప్రభుత్వం పోషణ భత్యం కింద నెలకు రూ. 500 అందిస్తోందన్నారు. సిబ్బంది మల్లిక వెంకటేశ్, ఆశవర్కర్లు ఉన్నారు.

వృద్ధుల సంక్షేమానికి కృషి చేయాలి

కెరమెరి: వృద్ధుల సంక్షేమం కోసం పాటుపడే నాయకులకే తమ మద్దతు ఉంటుందని మండలంలోని పలువురు వృద్ధులు పేర్కొంటున్నారు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో వృద్ధులు 'సాక్షి'తో తమ అభిప్రాయాలు పంచుకున్నారు.

జంగ్ తెలంగాణ

వృద్ధాశ్రమాలు ఏర్పాటు చేయాలి



ప్రతీ మండలంలో వృద్ధాశ్రమం ఏర్పాటు చేయాలి. చాలా ప్రాంతాల్లో వీరి ఆలనా, పాలనా చూసేవారు లేక వృద్ధులు ఇబ్బందులు పడుతున్నారు. ఎవరూ లేని వారికి సౌకర్యాలు కల్పించాలి. అలాంటి వారికే నా ఓటు వేస్తా.

- సెండే శంకర్, కెరమెరి

1న పింఛన్ అందించాలి



ఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా ప్రతీ నెల ఒకటో తేదీన పింఛన్ అందించే ఏర్పాటు చేయాలి. వృద్ధుల పట్ల ప్రేమ, అభిమానం ఉన్న నాయకుడు ఉంటే మంచిది. అలాంటి వారికే మద్దతిస్తాను.

- కేంద్రే దగుడు, కెరమెరి

ఇద్దరికీ పింఛన్ ఇవ్వాలి



గతంలో అధికారంలో ఉన్న ప్రభుత్వాలు కుటుంబంలో అర్హులందరికి పింఛన్ ఇచ్చే వారు. ప్రస్తుతం కుటుంబంలో భార్య లేదా భర్తకు ఇస్తున్నారు. ఇద్దరికీ ఇవ్వాలి.

- వాడై నాందేవ్, కెరమెరి

ప్రత్యేక పథకాలు అందించాలి



వృద్ధుల కోసం ప్రత్యేక పథకాలు అందించాలి. ఇప్పుడు కేవలం పింఛన్‌తోనే సరిపెట్టుకుంటున్నారు. అలా కాకుండా ఇంటి నిర్మాణంతో పాటు ఇతర సౌకర్యాలు కల్పించే వారికే నా మద్దతు ఉంటుంది.

- గావుత్రే జగ్గా, కెరమెరి


దహెగాం: శివాలయంలో నక్షత్ర హారతి ఇస్తున్న పండితుడు


ఆసిఫాబాద్: శివకేశవ మందిర్‌లో కాకడహారతికి హాజరైన భక్తులు


కెరమెరి: ప్రమిదలను నీటిలో జారవిడుస్తున్న భక్తులు

భక్తిశ్రద్ధలతో కార్తీక పౌర్ణమి


రెబ్బెన: ఆకాశదీపాన్ని పైకి ఎత్తుతున్న భక్తులు


ఆసిఫాబాద్: శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు


ఆసిఫాబాద్: పుణ్యస్నానాలు ఆచరిస్తున్న భక్తులు

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలో కార్తీకపౌర్ణమి వేడుకలను సోమవారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. శివుడికి అత్యంత ప్రీతికరమైన కార్తీక పౌర్ణమి సోమవారం రావడంతో పట్టణంలోని పెద్దవాగులో వేకువజామున భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి శివ, కేశవ ఆలయాలను దర్శించుకున్నారు. పట్టణంలోని బాలేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. వాసవీ మందిరం, కేశవనాథ ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. కాకడహారతి భక్త బృందం ఆధ్వర్యంలో గోపాలకృష్ణుడి చిత్రపటంతో కాకడవత్తులతో పురవీధుల్లో శోభాయాత్ర నిర్వహించారు. పౌర్ణమి పురస్కరించుకొని సత్యనారాయణ స్వామి వ్రతాలు జరుపుకున్నారు. కాకడహారతి ముగింపు సందర్భంగా మంగళవారం కేశవనాథ ఆలయంలో, బుధవారం శివకేశవ మందిరంలో అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు.

ఆసిఫాబాద్‌అర్బన్: పవిత్ర కార్తీక పౌర్ణమి సందర్భంగా జిల్లా కేంద్రంలోని ఆలయాలు భక్తులతో కిక్కిరిసి పోయాయి. ఆలయాలను దీపాలతో అలంకరించారు. బ్రాహ్మణవాడ కేశవనాథస్వామి ఆలయం, శివకేశవ ఆలయాల్లో పూజలు చేశారు.

దహెగాం: కార్తీకపౌర్ణమిని భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మండల కేంద్రంతో పాటు, ఐనం, కుంచవెల్లి, లగ్గాం, చినరాస్పెల్లి తదితర గ్రామాల్లోని ఆలయాల్లో భక్తుల సందడి కనిపించింది. మండల కేంద్రంలో స్థానిక శివాలయంలో తెల్లవారు జామున భక్తులు వచ్చి భోలాశంకరుడిని దర్శించుకున్నారు. అనంతరం సాయంత్రం భక్తులు ఆలయ ఆవరణలో దీపోత్సవ కార్యక్రమం నిర్వహించారు. చిన్నాపెద్దా తేడా లేకుండా అందరూ కలిసి దీపాలు వెలిగించారు.

కెరమెరి: కార్తీకపౌర్ణమి పురస్కరించుకుని మండల కేంద్రంలోని ఆలయాల్లో భక్తులు సోమవారం భక్తిశ్రద్ధలతో పూజలు జరిపారు. మండల కేంద్రంలో శివాలయంలో నెలరోజులుగా కొనసాగిన కాకడ హారతులు ముగిశాయి. సాంగ్వి వద్ద గల గంగ నదికి భక్తజనం పోటెత్తింది. మహిళలు మంగళ హారతులు ఇచ్చారు. అనంతం శివాలయం ఆవరణలో మహాఅన్నదానం నిర్వహించారు.

రెబ్బెన: మండలంలోని అన్ని గ్రామాల్లో భక్తులు కార్తీక పౌర్ణమి పర్వదినాన్ని భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. నంబాలలోని ప్రసన్న పరమేశ్వర స్వామి, గోలేటిలోని కోదండ రామాలయం, దుర్గాపూర్ శివాలయం, గంగాపూర్‌లోని శ్రీ బాలాజీ వెంకటేశ్వర స్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. భక్తులు ఉసిరి దీపాలు వెలిగించి ప్రత్యేక పూజలు చేశారు. గోలేటిలోని కోదండ రామాలయంలో భక్తులు ఆకాశదీపాన్ని పైకిఎత్తి కోదండ రాముడు, పరమేశ్వరుడిని దర్శించుకుని పూజలు చేశారు. మండల కేంద్రంలోని శివాలయంలో ఎంపీపీ జుమ్మిడి సౌందర్య కార్తీక దీపాన్ని వెలిగించి శివలింగానికి అభిషేకం చేశారు.

బెజ్జూర్: దీపోత్సవాన్ని మహిళలు సోమవారం అత్యంత ఘనంగా జరుపుకున్నారు. ఉదయాన్నే తలస్నానం చేసి ఆలయాలకు చేరుకున్నారు. కార్తీక దీపోత్సవ కార్యక్రమం నిర్వహించారు. మండల కేంద్రంలోని శ్రీ రంగనాయక ఆలయంతో పాటు చిన్న సిద్ధాపూర్ అభయాంజనేయ స్వామి ఆలయంలో దీపాల కార్యక్రమాన్ని నిర్వహించారు.


కెరమెరి: ధ్యానంలో కూర్చున్న భక్తులు


ఆసిఫాబాద్‌అర్బన్: దీపాలు వదులుతున్న భక్తులు


కెరమెరి: గౌరీ పూజలో పాల్గొన్న మహిళలు


కెరమెరి: గంగానదిలో నీటిని జారవిడుస్తున్న చిన్నారులు


రెబ్బెన: కోదండ రామాలయంలో భక్తుల సందడి


బెజ్జూర్: దీపోత్సవం నిర్వహిస్తున్న మహిళలు

పోలింగ్ కేంద్రాల్లో పూర్తిస్థాయి ఏర్పాట్లు చేయాలి

- జిల్లా ఎన్నికల అధికారి హేమంత్ సహదేవ్‌రావ్ బోర్కడే


మాట్లాడుతున్న హేమంత్ సహదేవ్‌రావ్ బోర్కడే

ఆసిఫాబాద్‌అర్బన్: అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా పూర్తిస్థాయి ఏర్పాట్లు చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హేమంత్ సహదేవ్‌రావ్ బోర్కడే తెలిపారు. సోమవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆసిఫాబాద్ రిటర్నింగ్ అధికారి దాసరి వేణు, ఇన్‌చార్జి జిల్లా పంచాయతీ అధికారి ఉమర్ హుస్సేన్‌లతో కలిసి మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, మండల పంచాయతీ అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో పోలింగ్ కేంద్రాల ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామపంచాయతీలలో అధికారుల పరిధిలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలలో ఎన్నికల అధికారులు, సిబ్బంది, ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేయాలని పేర్కొన్నారు. పోలింగ్ కేంద్రాలలో తాగునీరు, నిరంతర విద్యుత్ సరఫరా, ఫర్నిచర్, పోలింగ్ సిబ్బందికి భోజనం ఏర్పాటు చేయాలన్నారు.

బాండ్ పేపర్ రాసిన రావి శ్రీనివాస్


అఫిడవిట్‌తో రావి శ్రీనివాస్

కాగజ్‌నగర్‌టౌన్: ఎన్నికల్లో గెలిచిన తర్వాత కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీలను అమలు చేస్తానని ఆ పార్టీ సిర్పూర్ నియోజకవర్గ అభ్యర్థి రావి శ్రీనివాస్ అన్నారు. సోమవారం బాండ్ పేపర్‌పై రావి శ్రీనివాస్ అఫిడవిట్ రాసి ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధి కోసం పూర్తిగా అంకితమవుతానన్నారు.

'కాంగ్రెస్‌తోనే రాష్ట్రంలో సుస్థిర పాలన'


ప్రచారం చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

రెబ్బెన: కాంగ్రెస్‌తోనే రాష్ట్రంలో సుస్థిరమైన పాలన సాధ్యమవుతుందని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి అజ్మీర శ్యాం నాయక్‌కు మద్దతుగా మండలంలోని గోలేటి, గంగాపూర్, రెబ్బెన, తుంగెడ, మద్వాయిగూడ, నంబాల గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు.

ఘనంగా తులసీ వివాహం


కెరమెరిలో కొనసాగుతున్న తులసీ వివాహం

కెరమెరి: మండల కేంద్రంలోని శివాలయం ఆవరణలో భక్తిశ్రద్ధలతో తులసీ వివాహం నిర్వహించారు. మండల కేంద్రంలోని వివిధ వాడలకు చెందిన మహిళా భక్తులు తండోప తండాలుగా తరలివచ్చి ఉత్సవంలో పాల్గొన్నారు. ఇసుకతో తయారుచేసిన శివుడు, గంగా, గౌరీ ప్రతిమలకు పూజలు చేశారు. అనంతరం ఉసిరి, కృష్ణుడి ప్రతిమలకు వివాహం చేశారు. పురోహితుడు కులకర్ణి బాపూదేవ్ ఆధ్వర్యంలో వేదమంత్రాల నడుమ తులసీ వివాహోత్సవం నిర్వహించారు. అనంతరం ఆలయంలో సామూహిక మహాఅన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించారు.

ప్రతి ఒక్కరూ భక్తిమార్గం అలవర్చుకోవాలి


ఆసిఫాబాద్‌రూరల్: ప్రవచనాలు బోధిస్తున్న స్వాములు

ఆసిఫాబాద్‌రూరల్: ప్రతి ఒక్కరూ భక్తిమార్గం అలవర్చుకోవాలని చిన్మయానందగిరి స్వామి, నందగిరి, నారాయణ నందగిరి స్వాములు భక్తులకు సూచించారు. కార్తీక పౌర్ణమి సందర్భంగా సోమవారం మండలంలోని మోతుగూడ, బూర్గుడ గ్రామంలోని జగద్గురు బ్రహ్మనందగిరి స్వామి వేదాంత విచారణ ధ్యాన నిష్ఠాశ్రమంలో మూడు రోజులుగా వార్షికోత్సవ వేడుకలు నిర్వహించారు. ఉదయం సుప్రభాత సేవ, సామూహిక శ్రీభగవద్గీత పారాయణం, హోమం నిర్వహించారు. తీర్థ ప్రసాదాలు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సదా శివనందగిరి స్వామి, అబేధ నందగిరి స్వామి, మాతే కార్ మహరాజ్, కృష్ణ చరణానంద స్వామి, ఆశ్రమ భక్తులు బ్రహ్మయ్య, దాదాజీ, రాజయ్య, విశ్వనాథ్, కిషన్, భక్తులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ ముమ్మర ప్రచారం


బెజ్జూర్: రమాదేవికి తిలకం దిద్దుతున్న గ్రామస్తులు

కౌటాల: మండలంలో సిర్పూర్ బీఆర్‌ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి కోనేరు కోనప్ప సోమవారం ప్రచారం చేశారు. సంక్షేమ పథకాలు, అభివృద్ధి జరగాలంటే కారు గుర్తుకు ఓటేయాలని ప్రజలకు సూచించారు.

బెజ్జూర్: మండలంలో బీఆర్‌ఎస్ ప్రచారం ముమ్మరంగా సాగుతోంది. సోమవారం మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో కోనేరు రమాదేవి పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి గడపగడపకు తిరుగుతూ ఓట్లు అభ్యర్థించారు.

బీఆర్‌ఎస్ పార్టీకి మద్దతు

పెంచికల్‌పేట్: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి కోనేరు కోనప్పకు పూర్తి మద్దతు ఇస్తున్నట్లు చైతన్య దివ్యాంగుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎండీ ఖయ్యుం అన్నారు.

'దళితులను వేరు చేసే కుట్ర'


మాట్లాడుతున్న డాక్టర్ పాల్వాయి హరీశ్‌బాబు

కాగజ్‌నగర్‌టౌన్: దళితులను హిందూ సమాజం నుంచి వేరుచేసే కుట్ర జరుగుతోందని సిర్పూర్ బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ పాల్వాయి హరీశ్‌బాబు అన్నారు. పట్టణంలోని సంజీవయ్య కాలనీలో సోమవారం ఏర్పాటు చేసిన అణగారిన వర్గాల ఆత్మగౌరవ సభ, స్ట్రీట్ కార్నర్ మీటింగ్‌లకు హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో మధ్యప్రదేశ్ మంత్రి అశుతోష్ తివారీ, బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్, జిల్లా ఇన్‌చార్జి అరుముల్ల పోచం, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు బ్రహ్మయ్య, నాయకులు పాల్గొన్నారు.

సలుగుపల్లిలో మాజీ ఎమ్మెల్యే పాల్వాయి రాజ్యలక్ష్మి

బెజ్జూర్: ఈ ఎన్నికల్లో కమలం పువ్వు గుర్తుకు ఓటు వేసి పాల్వాయి హరీశ్‌బాబును భారీ మెజార్టీతో గెలిపించాలని మాజీ ఎమ్మెల్యే పాల్వాయి రాజ్యలక్ష్మి కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం మండలంలోని సలుగుపల్లి గ్రామంలో పర్యటించారు.

జిల్లాకేంద్రంలో బీఆర్‌ఎస్ ప్రచారం


ప్రచారం చేస్తున్న ప్రతినిధులు

ఆసిఫాబాద్‌అర్బన్: అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం జిల్లా కేంద్రంలో పద్మశాలీ సేవా సంఘం ఆధ్వర్యంలో ఇంటింటికీ తిరుగుతూ ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందిస్తూ, రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్న బీఆర్‌ఎస్‌కు ఓటు వేయాలని ఓటర్లను అభ్యర్థించారు.

శుద్ధ జలంతో వ్యాధులు దూరం

నేరడిగొండ: శుద్ధ జలంతో వ్యాధులు దూరమవుతాయని బాల వికాస స్వచ్ఛంద సంస్థ మేనేజర్ ప్రతాప్‌రెడ్డి అన్నారు. సంస్థ ఆధ్వర్యంలో సోమవారం మండలంలోని కుప్టి గ్రామంలో వాటర్‌ప్లాంట్ ప్రారంభించారు. కలుషిత నీటిని తాగడంతోనే వ్యాధుల బారిన పడుతున్నారని తెలిపారు.